VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 85
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
గురువారం 7 ఆగష్టు 2025

# ఏపీ క్యాబినెట్ నిర్ణయాలు...

- 'స్త్రీ శక్తి' పథకానికి ఆమోదం.. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం
- ఐటీ, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఆకర్షణకు 'లిఫ్ట్' పాలసీకి గ్రీన్ సిగ్నల్
- కొత్త బార్ పాలసీ 2025-28కి ఆమోదం.. లాటరీ పద్ధతిలో బార్ల కేటాయింపు
- మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌లకు అనుమతి.. బహిరంగ మద్యపానం నివారణే లక్ష్యం
- చేనేత, నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ పరిమితి పెంపు.. పలు సంక్షేమ పథకాలకు ఆమోదం
- ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏపీటీడీసీ హోటళ్ల అభివృద్ధి.. 33 ఏళ్లపాటు లీజుకు ఇచ్చేందుకు నిర్ణయం



**అమరావతి,కలంకౌంటర్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర భవిష్యత్ దిశను నిర్దేశించే పలు కీలక నిర్ణయాలకు వేదికైంది. ఎన్నికల హామీల అమలుతో పాటు, పారిశ్రామిక, ఐటీ రంగాల అభివృద్ధి, బలహీన వర్గాల సంక్షేమం లక్ష్యంగా మంత్రివర్గం అనేక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. వీటిలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించే 'స్త్రీ శక్తి' పథకం, ఐటీ కంపెనీలను ఆకర్షించేందుకు ఉద్దేశించిన 'లిఫ్ట్' పాలసీ అత్యంత ముఖ్యమైనవిగా నిలిచాయి. ఈ వివరాలను మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు.

**మహిళల కోసం 'స్త్రీ శక్తి'.. ఇక బస్సు ప్రయాణం ఉచితం..** రాష్ట్రంలోని మహిళలకు ప్రభుత్వం శుభవార్త అందించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 'స్త్రీ శక్తి' పథకానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఏపీఎస్ఆర్టీసీకి చెందిన పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. రాష్ట్రంలోని మెుత్తం 11,449 బస్సుల్లో 8,456 బస్సుల్లో ఈ పథకం అమలు కానుంది. దీనివల్ల ఏటా సుమారు 1.42 కోట్ల మంది మహిళలు లబ్ధి పొందుతారని, ప్రభుత్వంపై ఏటా రూ.1,942 కోట్ల ఆర్థిక భారం పడుతుందని అంచనా వేశారు. ఈ నిర్ణయంతో ప్రతి కుటుంబానికి నెలకు రూ.800 నుంచి రూ.1000 వరకు ఆదా అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

**ఐటీ రంగానికి 'లిఫ్ట్'.. బడా కంపెనీలే లక్ష్యం..** రాష్ట్ర విభజన తర్వాత ఐటీ రంగంలో హైదరాబాద్‌ను కోల్పోవడంతో ఏర్పడిన లోటును భర్తీ చేసేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. ఐటీ, ఐటీ ఆధారిత సేవలు (ఐటీఈఎస్), గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ)ను రాష్ట్రానికి ఆకర్షించే లక్ష్యంతో 'ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్నికల్ టెక్ హబ్స్' (లిఫ్ట్) పాలసీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పాలసీ కింద ఫార్చ్యూన్ 500, ఫోర్బ్స్ గ్లోబల్ 2000 వంటి జాబితాలలో స్థానం పొందిన బడా కంపెనీలకు పరిశ్రమల స్థాపన కోసం తక్కువ ధరకు భూములను కేటాయిస్తారు. విశాఖ, అమరావతి, తిరుపతి వంటి నగరాల్లో ఐటీకి అనువైన వాతావరణం కల్పించనున్నారు. అయితే, భూమి పొందిన కంపెనీలు కఠిన నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ఐటీ కంపెనీ అయితే కనీసం 3,000 ఉద్యోగాలు, జీసీసీ అయితే 2,000 ఉద్యోగాలు కల్పించాలి. ప్రతి ఎకరాకు కనీసం 500 మందికి ఉపాధి అవకాశాలు ఇవ్వాలనే షరతు విధించారు.

**కొత్త బార్ పాలసీ.. లాటరీతో కేటాయింపులు..** ఆగస్టు 31తో ముగియనున్న ప్రస్తుత బార్ పాలసీ స్థానంలో 2025–28 సంవత్సరాలకు నూతన బార్ పాలసీని కేబినెట్ ఆమోదించింది. కార్టెల్ వ్యవస్థను నిరోధించేందుకు, పారదర్శకత పెంచేందుకు ఈసారి బార్లను లాటరీ పద్ధతిలో కేటాయించాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా 840 బార్లకు లైసెన్సులు జారీ చేయనున్నారు. గీత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, వారికి లైసెన్స్ ఫీజులో 50% రాయితీతో 10% రిజర్వేషన్ కల్పించారు. జనాభా ఆధారంగా మూడు కేటగిరీలుగా లైసెన్స్ ఫీజును నిర్ణయించారు. వ్యాపార సమయాన్ని ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు పొడిగించారు.

**మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌లు..** బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని నివారించి, శాంతిభద్రతల సమస్యలను అరికట్టే లక్ష్యంతో ప్రభుత్వం మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇచ్చింది. రూ.5 లక్షల లైసెన్స్ ఫీజుతో, 1000 చదరపు అడుగులకు మించకుండా ఈ పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే, ఈ రూమ్‌లలో వంటగదికి అనుమతి లేదని స్పష్టం చేశారు.

**సంక్షేమానికి పెద్దపీట.. ఇతర నిర్ణయాలు..** చేనేత కార్మికులు: చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, గృహాల్లోని పవర్‌లూమ్‌లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించనున్నారు. నాయీ బ్రాహ్మణులు: హెయిర్ కటింగ్ సెలూన్లకు అందిస్తున్న ఉచిత విద్యుత్ పరిమితిని నెలకు 150 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు పెంచారు.

పర్యాటకం: రాష్ట్రంలోని 22 ఏపీటీడీసీ హోటళ్లను, రిసార్టులను ఆరు క్లస్టర్లుగా విభజించి, వాటి అభివృద్ధి, నిర్వహణ కోసం 33 సంవత్సరాల పాటు ప్రైవేట్ సంస్థలకు లీజుకు ఇవ్వాలని నిర్ణయించారు. విద్య: గత ప్రభుత్వం విలీనం చేసిన 4,731 పాఠశాలల పునర్నిర్మాణం, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణకు సంబంధించిన జీవోలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పరిశ్రమలు: రాష్ట్రంలో పారిశ్రామిక వాడల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసం ఏపీఐఐసీ ద్వారా రూ.7,500 కోట్ల రుణం సమీకరించే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. జర్నలిస్టులు: జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల మంజూరు కోసం కొత్త, సరళమైన నిబంధనలతో కూడిన 'ఆంధ్రప్రదేశ్ స్టేట్ మీడియా అక్రిడిటేషన్ రూల్స్ 2025'ను ఆమోదించారు. భద్రత: సీపీఐ (మావోయిస్టు) పార్టీ, దాని అనుబంధ సంస్థలపై ఉన్న నిషేధాన్ని మరో ఏడాది పాటు పొడిగించాలని కేబినెట్ నిర్ణయించింది.

# నైపుణ్యం మెరుగుపర్చుకోవడం ద్వారా భవిష్యత్ లో యువతకు అద్భుతమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

- 20 లక్షల ఉద్యోగాల కల్పనకు అందరం కష్టపడి పనిచేస్తున్నాం
- గ్రీన్ ఎనర్జీ రంగం ద్వారా గ్రామీణ యువత, మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- సెప్టెంబర్ 1వ తేదీన నైపుణ్యం పోర్టల్ ను ప్రారంభిస్తాం
- విజయవాడ నోవాటెల్ హెూటల్ లో నిర్వహించిన గ్రీన్ ఎనర్జీ కాన్ఫరెన్స్ లో మంత్రి నారా లోకేష్







**విజయవాడ,కలంకౌంటర్ :** మారుతున్న కాలానికి అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా భవిష్యత్ లో అద్భుతమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విజయవాడ నోవాటెల్ హెూటల్ లో "సోలార్, విండ్ ఎనర్జీ టాలెంట్ హబ్ గా ఆంధ్రప్రదేశ్" అనే అంశంపై ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్, స్వనీతి ఇనీషియేటివ్ సంయుక్తంగా నిర్వహించిన గ్రీన్ ఎనర్జీ కాన్ఫరెన్స్ కు మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ఈ కాన్ఫరెన్స్ కేవలం దేశ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్ ను శక్తివంతం చేయడం, సౌర, పవన శక్తికి నైపుణ్య హబ్ గా ఏపీని తీర్చిదిద్దడమే కాదు.. ప్రపంచ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్ ను శక్తివంతం చేసే దిశగా

- 2లో

# మరో యువగళం హామీని నెరవేర్చిన మంత్రి నారా లోకేష్

- కర్నూలు పట్టణం గూడెం కొట్టాలుకు చెందిన 150 మంది నిరుపేదలకు శాశ్వత ఇళ్ల పట్టాల పంపిణీ
- తమ 40 ఏళ్ల కల నెరవేర్చారని మంత్రి లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపిన గూడెం కొట్టాలు వాసులు





**అమరావతి,కలంకౌంటర్ :** విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మరో యువగళం హామీని నెరవేర్చారు. కర్నూలు పట్టణం అశోక్ నగర్ లోని నగరపాలక సంస్థ పంప్ హౌస్ ప్రాంతంలో నాలుగు దశాబ్దాలుగా ప్రభుత్వ స్థలంలో నివాసం ఉంటున్న 150 మంది గూడెం కొట్టాలు వాసులకు శాశ్వత ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. నిరుపేదలైన వీరు గూడెం కొట్టాల ప్రాంతంలో పూరి గుడిసెలు వేసుకుని నాలుగు దశాబ్దాలుగా నివాసం ఉంటున్నారు. తమకు శాశ్వత పట్టాలు ఇవ్వాలని ఏళ్లుగా ప్రజాప్రతినిధులను కోరుతున్నా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. యువగళం పాదయాత్రలో భాగంగా కర్నూలు వచ్చిన నారా లోకేష్ ను అప్పటి కర్నూలు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ టీజీ భరత్ నేతృత్వంలో గూడెం కొట్టాలు వాసులు కలిసి తమకు శాశ్వత పట్టాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన నారా లోకేష్... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శాశ్వత పట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వంలో 2025 జనవరిలో తీసుకువచ్చిన జీవో నెంబర్ 30 ద్వారా కోట్ల విలువ చేసే సుమారు ఎకరా స్థలాన్ని నిరుపేదలకు అప్పగించారు. మంత్రి టీజీ భరత్ చేతుల మీదుగా 150 మంది నిరుపేదలకు మంగళవారం నాడు శాశ్వత ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. తమ 40 ఏళ్ల కల నెరవేర్చిన మంత్రి నారా లోకేష్ కు ఈ సందర్భంగా గుడెం కొట్టాల వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వ పథకాలపై సీఎం బొమ్మలు, పార్టీ గుర్తులు ఉండొచ్చు... మద్రాస్ హైకోర్టు తీర్పును కొట్టివేసిన సుప్రీంకోర్టు

- ప్రభుత్వ పథకాలకు నేతల పేర్లు, ఫోటోల వాడకంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు
- మద్రాస్ హైకోర్టు ఇచ్చిన వ్యతిరేక ఉత్తర్వులను కొట్టివేసిన సర్వోన్నత న్యాయస్థానం
- ఇది దేశవ్యాప్తంగా ఉన్న విధానమేనని స్పష్టం చేసిన కోర్టు
- రాజకీయ పోరాటాలు ప్రజల్లోనే జరగాలి, కోర్టుల్లో కాదని హితవు
- పిటిషన్ వేసిన ఏఐఏడీఎంకే ఎంపీకి రూ.10 లక్షల జరిమానా
- డీఎంకే ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు.. భారీ ఊరట



**న్యూఢిల్లీ, కలంకౌంటర్ :** రాజకీయ యుద్ధాలు కోర్టుల్లో కాదు, ప్రజల మధ్యే జరగాలని సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు జీవించి ఉన్న రాజకీయ నాయకులు, మాజీ ముఖ్యమంత్రులు లేదా పార్టీల సైద్ధాంతిక నాయకుల పేర్లు, ఫోటోలు, చిహ్నాలు వాడరాదంటూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సర్వోన్నత న్యాయస్థానం బుధవారం కొట్టివేసింది. ఈ తీర్పుతో తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వానికి భారీ ఊరట లభించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించింది. తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను అనుమతించింది. మద్రాస్ హైకోర్టులో ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేసిన ఏఐఏడీఎంకే ఎంపీ సి.వి. షణ్ముగంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఆయన పిటిషన్‌ను కొట్టివేయడమే కాకుండా, రూ. 10 లక్షల జరిమానా విధించింది. రాజకీయ నాయకుల పేర్లతో పథకాలు ప్రవేశపెట్టడం దేశవ్యాప్తంగా సర్వసాధారణంగా జరుగుతున్న విషయమని ధర్మాసనం అభిప్రాయపడింది. "అన్ని రాజకీయ పార్టీల నాయకుల పేర్లతో పథకాలు అమలులో ఉన్నప్పుడు, పిటిషనర్ కేవలం ఒకే పార్టీని, ఒకే నాయకుడిని లక్ష్యంగా చేసుకోవడం వెనుక ఉద్దేశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రజాధనం దుర్వినియోగంపై నిజంగా ఆందోళన ఉంటే, అన్ని పథకాలపైనా పిటిషన్ వేయాల్సింది" అని కోర్టు పేర్కొంది. షణ్ముగం దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) చట్ట ప్రకారం చెల్లదని, ఇది న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని ధర్మాసనం స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి స్టాలిన్ పేరుతో ఉన్న 'ఉంగళుదన్ స్టాలిన్' (మీ స్టాలిన్) పథకాన్ని సవాల్ చేస్తూ ఏఐఏడీఎంకే ఎంపీ షణ్ముగం మొదట కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు.



మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్ రావు జయంతి సందర్భంగా తన నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్–సీపీ అధినేత వైయస్ జగన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కుమారుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, తలశిల రఘురామ్, మాజీ మంత్రులు పేర్ని నాని, విడదల రజిని, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు.
**–తాడేపల్లి,కలంకౌంటర్ :**

VAARAHI
SILKS
Threads of Luxury, Woven with love...



Patola Banaras | Kanjeevaram | Paithani | Organza | Chikankari | Soft Pattu | Muslin
Bandhini | Kanchi Tissue | Crush Tissue | Designer Tussar | Georgette | Fancy | Ikkat
VAARAHI SILKS Ph. 91000 03343 | www.vaarahisilks.com
Road No. 36, Jubilee Hills | Road No.1, Kukatpally.
SCAN TO FOLLOW US ON
INSTAGRAM FACEBOOK

# విద్యార్థులకు శక్తి యాప్ పై అవగాహన





**పిట్టలవాని పాలెం (బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** బాపట్ల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బాపట్ల డిఎస్పి , బాపట్ల రూరల్ సర్కిల్ సీఐ ఉత్తర్వుల మేరకు చందోలు ఎస్సై మరియు బాపట్ల శక్తి సబ్ డివిజన్ టీం వారు ఈరోజు పిట్టలవానిపాలెం జూనియర్ కళాశాల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శక్తి యాప్ ను ఎలా ఉపయోగించాలి అనే అంశం తెలియజేసారు. విద్యార్థులతో సంభాషించి శక్తి యాప్ ద్వారా విద్యార్థులచే శక్తి టెస్ట్ కాల్స్ చేసి చూపించటం చేశారు. త ద్వారా ప్రత్యక్షంగా విద్యార్థులకు శక్తి యాప్ గురించి అవగాహన కల్పించారు .,శక్తీ వాట్స్ యాప్ ఫిర్యాదుల ప్రాధాన్యత, గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ మరియు, సెల్ఫ్ డిఫెన్స్ మరియు సోషల్ మీడియా ద్వారా ఫొటోస్ మార్ఫింగ్ , ఫేక్ వీడియోస్ ఎలా ఎదుర్కోవాలి, యాంటీ డ్రగ్స్, సైబర్ నేరాలు పట్ల విద్యార్థులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలోశివకుమార్ యాదవ్,సిబ్బంది పాల్గొన్నారు.

# రాయచోటి - మదనపల్లి మధ్య ట్రాఫిక్ ఐలాండ్ ఏర్పాటు చర్యలు...మంత్రి మండిపల్లి సూచన



**అమరావతి,కలంకౌంటర్ :** రాయచోటి, మదనపల్లి మధ్య రహదారిపై రహదారి ప్రమాదాల నివారణకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ రహదారి ప్రాధికార సంస్థ (NHAI) చైర్మన్ ఆర్.కె. సింగ్, రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధికారులతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా, రాయచోటి %-% మదనపల్లి మధ్య ప్రయాణం చేసే వాహనదారుల భద్రత దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత ప్రణాళికలో ఉన్న అండర్ పాస్ స్థానంలో ట్రాఫిక్ ఐలాండ్ ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రమాదాలను తగ్గించడంలో ట్రాఫిక్ ఐలాండ్‌లు కీలకంగా ఉంటాయని పేర్కొంటూ, అవసరమైన మార్పులు వెంటనే చేపట్టాలని సూచించారు. ఈ మేరకు తగిన ప్రణాళికను రూపొందించి త్వరితగతిన అమలు చేయాలనీ, ప్రజల ప్రయాణ భద్రతకు ఎలాంటి తడబాటు ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు.

# నల్లవాగు కాలువ పూడిక తీత పనులు



**తిరువూరు,కలంకౌంటర్ :** మండలం లోని చిట్టేల గ్రామం లో నల్లవాగు కాలువ పూడిక తీత పనులు దగ్గరుండి చేయిస్తున్న గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి శ్రీనివాసరావు. కాలువలు పూడి పోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవటం తో రైతాంగం పడుతున్న ఇబ్బందులను దృష్టిలో వుంచుకుని గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి శ్రీనివాసరావు పలు కాలువల పూడిక తీత పనులు చేపట్టటం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు .గ్రామ సర్పంచ్ తుమ్మలపల్లి శ్రీనివాసరావు,అనుమల వెంకటేశ్వరరావు, తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు , నీటి సంఘం అధ్యక్షురాలు శ్రీమతి బొంతు నాగమణి పనులను పర్యవేక్షించారు .

# కార్పొరేషన్ చైర్మన్ ను కలిసిన వైస్ చైర్మన్



**చీరాల,కలంకౌంటర్ :** ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ ను మర్యాద పూర్వకంగా కలిసి చీరాల మున్సిపల్ వైస్ చైర్మన్ పి సుబ్బయ్య తదితరులు ఘనంగా సన్మానించారు.

# నేతన్నల లోగిళ్లలో 'చంద్ర'కాంతులు

- చేనేతలకిచ్చిన ఎన్నికల హామీని నెరవేర్చిన సీఎం చంద్రబాబు
- నేడు 3 పథకాలకు శ్రీకారం
- రూ.189.62 కోట్లతో ఉచిత విద్యుత్ పథకం అమలు
- మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్లు ఉచితం
- రూ.5 కోట్ల త్రిఫ్ట్ పథకం నిధులు మంజూరు
- చేనేత వస్త్రాలపై 5 శాతం జీఎస్టీ మినహాయింపు
- ఉచిత విద్యుత్ తో నేతన్నలకు ఎంతో మేలు
- మగ్గాలపై నేసే నేతన్నలకు ఏడాదికి రూ.14,956లు
- మర మగ్గాలపై ఆధారపడిన నేతన్నలకు రూ32,604ల లబ్ధి
- చేనేతలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట
- 365 రోజులూ ఉపాధి... నేతన్నల ఆర్థిక వృద్ధికి పథకాల రూపకల్పన
- 50 ఏళ్లకే రూ.4 వేల పెన్షన్
- ముద్ర రుణాలు, నూలు సబ్సిడీ అందజేత
- క్లస్టర్లు, టెక్స్ టైల్స్ పార్క్ ల ఏర్పాటు
- మంత్రి లోకేశ్ స్ఫూర్తితో రాష్ట్రంలో వీవర్ శాలల నిర్మాణానికి ప్రణాళికలు
- విశాఖలో రూ.172 కోట్లతో యూనిటీ మాల్ నిర్మాణం



**అమరావతి,కలంకౌంటర్ :** సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాకతో చేనేతల బతుకుల్లో వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఏడాది కాలం నుంచి నేతన్నలు తమ కాళ్ల మీద తామే నిలబడి, గౌరవప్రదమైన జీవనం సాగించేలా బృహత్తర కార్యక్రమాలకు నాంది పలికింది. ఒకవైపు నేతన్నలకు సంక్షేమ పథకాలు అందిస్తూనే, చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించి వారి ఆర్థిక ఉన్నతికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. రాష్ట్రంలో వ్యవసాయం తరవాత అత్యధిక మంది చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. 2.50 లక్షల మంది చేనేత వస్త్రాల తయారీనే జీవనాధారంగా చేసుకున్నారు. ఏపీలో 986 చేనేత సహకార సంఘాలు నేతన్నలకు ఉపాధి కల్పిస్తున్నాయి. రాష్ట్రంలో చేనేత రంగం రూ.1,374 కోట్ల టర్నోవర్ కలిగి ఉంది. గత ప్రభుత్వ హయాంలో చేనేతలకు ప్రోత్సాహం కరవ్వడంతో పాటు ఉత్పత్తులకు మార్కెటింగ్ సదు-పాయం కూడా లభించలేదు. దీంతో 2019-24 కాలంలో రాష్ట్ర చేనేత రంగంలో చీకటి కాలంగా మిగిలిపోయింది. సీఎం చంద్రబాబునాయుడు, యువగళం పాదయాత్ర ద్వారా మంత్రి నారా లోకేశ్ చేనేత కష్టాలను చూసి చలించిపోయారు. అధికారంలోకి రాగానే నేతన్నలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇచ్చిన హామీలనను నిలబెట్టుకుంటూ అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి చేనేతలకు మేలు కలిగేలా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో నేతన్నలకు ప్రత్యేక యూనిట్లు కేటాయిస్తున్నారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి రూ.10 వేల కోట్ల పెట్టుబడితో నూతన టెక్స్ టైల్స్ పాలసీని తీసుకొచ్చింది. ఈ పాలసీ ద్వారా 1.51 లక్షల మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం, చేనేత వస్త్రాలపై అయిదు శాతం మేర జీఎస్టీ మినహాయింపు, త్రిఫ్ట్ నిధులు మంజూరు పథకాలకు సీఎం చంద్రబాబునాయుడు శ్రీకారం చుడుతున్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక వ్యాపారవేత్తను తయారు చేయాలన్న లక్ష్యంలో భాగంగా నేతన్నలను వ్యాపారులుగా తీర్చిదిద్దే కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారు.

**నేతన్నకు 50 ఏళ్లకే రూ.4 వేల పెన్షన్..** 2024లో సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వం కూడా చేనేతలకు మరోసారి అండగా నిలిచింది. 50 ఏళ్లు నిండిన్న నేతన్నలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేస్తున్నారు. 92,724 మంది నేతన్నలకు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెన్షన్ మొత్తం పెంచారు. ఈ ఏడాది జూన్ వరకూ రూ.545.50 కోట్లు నేతన్నల పెన్షన్ల కోసం చంద్రబాబు ప్రభుత్వం వెచ్చించింది.

**ముద్ర రుణాలు, నూలు సబ్సిడీ అందజేత..** క్యాష్ క్రెడిట్ కార్డులతో సహకార సంఘాల బలోపేతానికి బ్యాంకు రుణాలు అందజేస్తోంది. గతేడాది 116 చేనేత సహకార సంఘాలకు రూ.40.87 కోట్లను జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల ద్వారా అందజేసింది. ఈ ఏడాది 110 సంఘాలకు రూ.37.75 కోట్లు రుణమివ్వడానికి నిర్ణయించింది. ప్రధాన మంత్రి చేనేత ముద్ర యోజన పథకం(ముద్ర) కింద నేతన్నలకు గతేడాది వర్కింగ్ కాపిటల్ నిమిత్తం రూ.33.25 కోట్లు అందించింది. 3,367 నేతన్నలకు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల రుణ సదుపాయం కల్పించింది. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలో జూన్ వరకు 294 మందికి రూ.2.57 కోట్లు మంజూరు చేసింది. ముడి పదార్థాల సరఫరా పథకం నూలు కొనుగోలుపై కూటమి ప్రభుత్వం 15 శాతం సబ్సిడీ అందజేస్తోంది. సహకార సంఘాలు, వ్యక్తిగతంగా చేనేత నేతన్నలకు రూ.164.24 కోట్ల విలువైన నూలును 15 శాతం సబ్సిడీపై ఇవ్వగా, దీనివల్ల లబ్ధిదారులకు రూ.24.63 కోట్ల మేర లబ్ధి కలిగింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 135 మంది స్వయం సహాయక సంఘాల్లో ఉన్న చేనేత మహిళలకు రూ.13.50 లక్షల విలువైన నూలును ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున కూటమి ప్రభుత్వం అందజేసింది.

**క్లస్టర్లు, టెక్స్ టైల్స్ పార్కుల ఏర్పాటు...** కేంద్ర ప్రభుత్వ సహకారంతో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖపట్నంలో అయిదు ఎకరాల్లో రూ.172 కోట్లతో యూనిటీ మాల్ నిర్మిస్తోంది. రాష్ట్రంలో టెక్స్ టైల్ పార్కుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఎమ్మిగనూరులో పాటు రాయదుర్గం, మైలవరం, పామిడిలోనూ టెక్స్ టైల్ పార్కులు నిర్మించనుంది. ఎమ్మిగనూరు టెక్స్ టైల్ పార్కును 77 ఎకరాల్లో నిర్మాణానికి ప్రభుత్వం శంకుస్థాపన కూడా చేసింది. చీరాలలో హ్యాండ్లూమ్ పార్క్ తో పాటు టెక్స్ టైల్ పార్కు కూడా ఏర్పాటు చేయనుంది. నాగరిగిరి మెగా టెక్స్ టైల్ పార్కు నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2014-19లో రూ.50.15 కోట్లతో 54 క్లస్టర్లు ఏర్పాటు చేశారు. జాతీయ హ్యాండ్లూమ్ అభివృద్ధి ప్రోగ్రామ్ కింద 2024-25లో రూ.10.44 కోట్లతో 10 క్లస్టర్లు ఏర్పాటు చేస్తోంది. ఈ క్లస్టర్లతో 2,020 మంది లబ్ధిపొందుతున్నారు. కేంద్ర ప్రభుత్వ సాయంతో శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో రూ.38.21 కోట్లతో భారీ చేనేత క్లస్టర్ ను రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. ఈ క్లస్టర్ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేల మందికి లబ్ధి చేకూరనుంది. మంగళగిరిలో మంత్రి నారా లోకేశ్ ఏర్పాటు చేసిన వీవర్ శాల మాదిరిగా రాష్ట్ర వ్యాప్తంగా వీవర్ శాలల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది

**రూ.80 కోట్ల మేర ఆప్కో అమ్మకాలు..** మారుతున్న కాలానుగుణంగా నూతన వస్త్రాల తయారీలో అయిదు జిల్లాల్లో నైపుణ్య అభివృద్ధి శిక్షణా కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. చేనేత వస్త్రాల విక్రయాలకు రాష్ట్రంతో పాటు దేశంలోని ఏడు నగరాల్లో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసింది. ఆప్కో నేతృత్వంలో ఈ కామర్స్ ద్వారా నేరుగా వినియోగదారుల ఇళ్ల వద్దకే చేనేత వస్త్రాలను డెలివరీ చేస్తోంది. ఏడాది కూటమి పాలనలో ఆప్కో షోరూమ్ ల ద్వారా రూ.80 కోట్ల మేర అమ్మకాలు జరిగాయి. ఈ కామర్స్ ద్వారా రూ.40 లక్షల మేర అమ్మకాలు జరపడం విశేషం. నేటి తరం అభిరుచులకు అనుగుణంగా చేనేత రెడీమేడ్ వస్త్రాలను రూపొందించి ఆప్కో షోరూమ్ ల ద్వారా అమ్మకాలు చేపట్టింది. ఏడాదిలో రాష్ట్రంలో అయిదు ఆప్కో షోరూమ్ లను ప్రభుత్వం ప్రారంభించింది. నేతన్నలకు 365 రోజుల పాటు పనిదినాలు కల్పించడంతో పాటు చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడానికి టాటా తనేరియా, ఆద్యం బిర్లా గ్రూప్, తమిళనాడుకు చెందిన కో ఆప్టెక్స్ తోనూ ఒప్పందం చేసుకుంది.

**ఓడీఓపీ అవార్డుల వెల్లువ..** రాష్ట్రంలో చేనేత రంగానికి సీఎం చంద్రబాబునాయుడు తీసుకుంటున్న సత్ఫలితాలిస్తున్నాయి. ఇందుకు నిదర్శనమే వన్ డిస్ట్రిక్ట్-వన్ ప్రొడక్ట్(ఓడీఓపీ) అవార్డులు. కేంద్ర ప్రభుత్వం 29 ఓడీఓపీ అవార్డులు ప్రకటిస్తే, అందులో 9 అవార్డులు ఏపీకే సొంతమయ్యాయి. వాటిలో 4 అవార్డులు చేనేత ఉత్పత్తులు దక్కాయి. ఓడీఓపీ రాష్ట్ర స్థాయి అవార్డుల్లో ఏపీ బంగారు పతకం సాధించింది. భవిష్యత్తులో మరిన్ని ఓడీఓపీ అవార్డుల సాధనే ధ్యేయంగా చేనేత కార్మికులకు నైపుణ్య పెంపుదలకు శిక్షణ కార్యక్రమాలు, తయారైన ఉత్పత్తులకు జీఐ ట్యాగ్ గుర్తింపునకు పెద్దపీట వేస్తోంది. 20 చేనేత ఉత్పత్తులకు జీఐ ట్యాగ్ కోసం రూ.24 లక్షలు వెచ్చిస్తోంది.

**నూతన డిజైన్లకు ప్రోత్సాహం..** ప్రస్తుత పోటీ ప్రపంచంలో చేనేత వస్త్రాల వినియోగం పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దీనిలో భాగంగా నేతన్నలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఏపీ స్కిల్ డవలప్ మెంట్ కార్పొరేషన్ ద్వారా అయిదు జిల్లాల్లో నైపుణ్య శిక్షణలు నిర్వహించగా 180 మంది లబ్ధి పొందారు. చేనేత కార్మికుల్లో నైపుణ్యాన్ని వెలికితీసే ఉద్దేశంతో, నూతన డిజైన్లపై దరఖాస్తులను కూటమి ప్రభుత్వం నేతన్నల నుంచి ఆహ్వానించింది. ఉత్తమ డిజైన్లకు రూ.5 లక్షల వరకూ బహుమతులు అందజేయనుంది.

**నేడు 3 పథకాలకు సీఎం చంద్రబాబు శ్రీకారం...** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, సీఎం చంద్రబాబునాయుడు చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇచ్చే పథకానికి గురువారం శ్రీకారం చుడుతున్నారు. చేనేత వస్త్రాలపైనా 5 శాతం జీఎస్టీ మినహాయింపు పథకాన్నీ కూడా ప్రారంభిస్తున్నారు. చేనేతలకు రూ.5 మేర త్రిఫ్ట్ నిధులు మంజూరు చేస్తున్నారు. ఉచిత విద్యుత్ కోసం ఏడాదికి రూ.190 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తోంది. జీఎస్టీ మినహాయింపునకు ఏడాదికి రూ.15 కోట్లను నేతన్నలకు చెల్లించాలని నిర్ణయించింది. ఉచిత విద్యుత్ పథకంతో మగ్గాలపై నేసే నేతన్నలకు నెలకు1,233ల చొప్పున ఏడాదికి రూ.14,956లు, మర మగ్గాలపై ఆధారపడిన వారికి నెలకు రూ.2,717ల చొప్పున 32,604ల మేర లబ్ధి కలగనుంది. చేనేత కుటుంబాలకు త్వరలో ఆరోగ్య బీమా పథకం వర్తింప చేయడానికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. త్వరలో చేనేత సహకార సంఘాల ఎన్నికలు కూడా నిర్వహించడానికి ఏర్పాట్లు చేపట్టింది.

# హజ్ యాత్రికుల అకౌంట్లలోకి రూ.లక్ష జమ

## -మైనారిటీలకు అండగా కూటమి ప్రభుత్వం - రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్



**అమరావతి,కలంకౌంటర్ :** విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రాన్ని మొదటి ప్రాధాన్యతగా ఎన్నుకొని హజ్ యాత్ర-2025ను దిగ్విజయంగా పూర్తి చేసి వచ్చిన హజ్ యాత్రికులకు ఒక్కొక్కరికి రూ.లక్ష సాయాన్ని ప్రభుత్వం చెల్లించింది.కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 72 మందికి రూ.72 లక్షలు మంజూరు చేసిన 24 గంటల వ్యవధిలోనే నేరుగా వారి బ్యాంక్ అకౌంట్ లలోకి మొత్తాన్ని బదిలీ చేసి హామీని నిలబెట్టుకోవడం జరిగిందని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ బుధవారం అమరావతి లో విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం కు మొదటి ప్రాధాన్యతను ఇచ్చి, సాంకేతిక కారణాల వలన హైదరాబాద్ ఎంబార్కేషన్ కేంద్రం నుండి హజ్ యాత్ర చేసుకొని వచ్చిన ప్రతి ఒక్క హజ్ యాత్రికుని వ్యక్తిగత అకౌంట్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ తరఫున జమ చేయడం జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం, ఇచ్చిన మాటకు కట్టుబడి హజ్ యాత్రికులకు ఆర్థిక సహాయం ను నేరుగా వారికే వ్యక్తిగత అకౌంట్లలోకి జమ చేసి పారదర్శకతను ప్రభుత్వం నిరూపించిందని తెలిపారు. కాగా హజ్-2026 లో విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుండి బయలుదేరే హజ్ యాత్రికులందరికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున కూటమి ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందుకోసం రాష్ట్రం నుండి అత్యధిక సంఖ్యలో వెళ్లే హజ్ యాత్రికులు విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రంను మొదటి ప్రాధాన్యత గా ఎన్నుకోవాలని కోరారు. మైనారిటీ వర్గాల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు కు ముస్లిం ప్రజానీకం తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

**జిల్లాలవారీగా లబ్ధిదారుల సంఖ్య..** గుంటూరు జిల్లా నుండి 18 మంది, కృష్ణా నుండి 18, అన్నమయ్య నుండి 14, ఎన్టీఆర్ జిల్లా నుండి 11, వైయస్సార్ కడప నుండి నలుగురు, ఏలూరు నుండి ముగ్గురు, బాపట్ల నుండి ఇద్దరు, విశాఖ నుండి ఒక్కరు, కాకినాడ నుండి ఒకరికి రూ. లక్ష ప్రకారం వారి అకౌంట్లకు జమ చేసినట్లు మంత్రి ఫరూక్ తెలిపారు.

# నైపుణ్యం మెరుగుపర్చుకోవడం ద్వారా భవిష్యత్ లో యువతకు అద్భుతమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ కాన్ఫరెన్స్ ను నిర్వహించడం జరుగుతోంది. తద్వారా మన యువతకు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

**యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనకు అందరం కష్టపడి పనిచేస్తున్నాం..** దేశంలో ఏ పార్టీ సాధించని విధంగా కూటమి ప్రభుత్వం 94శాతం స్ట్రైక్ రేట్ తో 164 సీట్లను కైవసం చేసుకోవడం జరిగింది. కూటమి ప్రభుత్వంలో ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చాం. ఇందుకోసం అందరం కష్టపడి పనిచేస్తున్నాం. ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా నినాదం. క్లస్టర్ విధానంలో పెట్టుబడులను ఆకర్షిస్తాం. ఇందుకు కావాల్సిన ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేస్తాం. అనంతలో ఆటోమొబైల్, కర్నూలు రెన్యువబుల్ ఎనర్జీ, కడప, చిత్తూరును ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ గా, నెల్లూరులో ఎయిర్ కండిషనర్స్ వంటి స్పెషలైజ్డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ప్రకాశం జిల్లాను సీబీజీ హబ్ గా, గుంటూరు, కృష్ణాను క్యాంటమ్ వ్యాలీ హబ్ గా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలను ఆక్వా హబ్ గా, ఉత్తరాంధ్రను ఫార్మా, డేటా సెంటర్, ఐటీ హబ్ గా, మెడికల్ డివైస్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ గా తయారు చేస్తాం. ప్రతి వంద కి.మీలకు ఓ క్లస్టర్ ఏర్పాటుచేసి ఆయా రంగాల్లో టాప్ 20 కంపెనీలను తీసుకువచ్చేందుకు కృషిచేస్తున్నాం. దీంతో పాటు నైపుణ్యం పెంపు, నవీన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది.

**సెప్టెంబర్ 1వ తేదీన నైపుణ్యం పోర్టల్ ను ప్రారంభిస్తాం..** రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో రాష్ట్రానికి అనేక పరిశ్రమలు వస్తున్నాయి. ప్రైవేటు సెక్టార్ తో నైపుణ్యం గల యువతను అనుసంధానించాల్సిన అవసరం ఉంది. సెప్టెంబర్ 1న నైపుణ్యం పోర్టల్ ను ప్రారంభించడం జరుగుతోంది. స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్, సీడాప్ ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తాం. ప్రపంచ అవసరాలకు అనుగుణంగా అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. పునరుత్పాదక ఇంధన రంగంలో ప్రపంచవ్యాప్తంగా అనేక అవకాశాలు ఉన్నాయి. ఇందుకోసం రాష్ట్రం చొరవ తీసుకుని యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందిస్తాం. అవకాశాలను అందిపుచ్చుకునేలా యువతను సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది. నా ఛాలెంజ్ ను స్వీకరించి సుజ్లాన్ సంస్థ ఇప్పటికే 2 నైపుణ్య శిక్షణా కేంద్రాలను నిర్మించింది. అవి ఇప్పటికే పనిచేస్తున్నాయి.

**గ్రీన్ ఎనర్జీ రంగం ద్వారా యువతకు విస్తృత అవకాశాలు..** గ్రీన్ ఎనర్జీ రంగం ద్వారా మహిళలకు వారి గ్రామాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. యువగళం పాదయాత్ర సమయంలో అనంత జిల్లాలోని కియా యాన్సిలరీ యూనిట్స్ లో మహిళలు పనిచేయడం చూశాను. ఓ మహిళ నా వద్దకు వచ్చి నాతో పాటు నడిచారు. ఏం చేస్తున్నారని ఆ మహిళను ప్రశ్నించగా.. తాను కియా యాన్సిలరీ యూనిట్స్ లో పనిచేస్తున్నానని, గతంలో సాధారణ గృహిణిగా ఉన్న తాను ఇప్పుడు నెలకు రూ.40వేలు సంపాదిస్తూ కుటుంబానికి అండగా నిలిచానని గర్వంగా చెప్పారు. ఇప్పుడు కుటుంబంలో తనకు ఎంతో గౌరవం దక్కుతోందని చెప్పారు. ఒక్క కియా పరిశ్రమ వల్ల అనంతపురం జిల్లాలో వచ్చిన మార్పు ఇది. గ్రీన్ ఎనర్జీ రంగంలో కూడా విస్తృత అవకాశాలు ఉన్నాయి. అందుకే విండ్, సోలార్, రెన్యువబుల్, పంప్డ్ స్టోరేజీ, సీబీజీ ప్రాజెక్టులపై ప్రధానంగా దృష్టిసారించాం. 20 లక్షల ఉద్యోగాల కల్పనపై గౌరవ సీఎం చంద్రబాబు గారు చాలా పట్టుదలతో ఉన్నారు. దీనిని చాలా ప్రాముఖ్యతగా తీసుకున్నాం. ఇందుకోసం ప్రైవేటు సెక్టార్ తో కలిసి పనిచేస్తాం. ఓంక్యాప్ ద్వారా యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపిఎస్ఎస్ డిసి ఛైర్మెన్ బూరుగుపల్లి శేషారావు, NREDCAP వైస్ చైర్మెన్ కమలాకర్ బాబు, స్వనీతి ఇనీషియేటివ్ సీఈఓ రీత్వికా భట్టాచార్య పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో బీసీ గురుకుల విద్యార్థులకు స్వర్ణపతకాలు

- పరుగు పోటీల్లో స్వర్ణపతకాలు సాధించిన ఇద్దరు విద్యార్థులు
- అభినందించిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి, కార్యదర్శి, ఎంజెపి కార్యదర్శి



**తెలంగాణ,కలంకౌంటర్ :** బీసీ గురుకుల విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్ అసోసియేషన్ నిర్వహించిన 11వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ క్రీడా పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించారు. ఈనెల 3,4 తేదీల్లో హన్మకొండ లోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన క్రీడా పోటీల్లో మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాసంస్థల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు స్వర్ణ పతకాలను సాధించారు. 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంలో వరుసగా రెండు స్వర్ణ పతకాలను కే. శివకుమార్ సాధించాడు. మహబూబ్ నగర్ జిల్లా లోని కోయిల్ కొండ బీసీ గురుకుల కాలేజీలో శివకుమార్ ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. 600 మీటర్ల పరుగు పోటీల్లో స్వర్ణ పతకం ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న భరత్ సాధించాడు. యాదగిరి భువనగిరి జిల్లా లోని పోచంపల్లి లో బీసీ గురుకుల కాలేజీ లో భరత్ ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. స్వర్ణ పతకాలను గెలుచుకున్న విద్యార్థులను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సెక్రటరీ శ్రీధర్, ఎంజెపి సెక్రటరీ బడుగు సైదులు, జాయింట్ సెక్రటరీ తిరుపతి అభినందించారు. తెలంగాణ విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా శిక్షణ ఇస్తున్న ప్రభుత్వం స్టేట్ స్పోర్ట్ పాలసీని అందుబాటులోకి తీసుకువచ్చిందని, రానున్న రోజుల్లో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో వివిధ క్రీడల్లో తెలంగాణ విద్యార్థులు పతకాలు సాధించాలని ఎంజెపి కార్యదర్శి బడుగు సైదులు ఆకాంక్షించారు. ఇటీవల సెయిలింగ్ పోటీల్లోనూ బీసీ గురుకుల విద్యార్థులు పతకాలు సాధించారని ఆయన గుర్తుచేశారు. విద్యార్థుల ఆసక్తి మేరకు వారికి క్రీడల్లో శిక్షణ ఇస్తున్నామని, ప్రభుత్వం అనేక పోటీల్లో విద్యార్థులు అనేక పోటీల్లో పాల్గొన్నడానికి అవసరమైన శిక్షణ, ప్రోత్సాహం, ఆర్థిక సహకారం ప్రభుత్వం అందిస్తున్నదని ఆయన తెలిపారు.

# నాయీ బ్రాహ్మణులకు చంద్రన్న తీపి కబురు

● మరో ఎన్నికల హామీని నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం ● సెలూన్లకు ఉచిత విద్యుత్ 150 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు పెంపు ● కేబినెట్ లో ఉచిత విద్యుత్ పెంపుపై ఆమోదం ● మంత్రి సవిత హర్షం ● ఎన్నికల హామీని నిలబెట్టుకున్నందుకు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు



**అమరావతి ,కలంకౌంటర్ :** నాయీ బ్రాహ్మణులకు ఇచ్చిన మరో హామీని నెరవేర్చడంపై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తంచేశారు. అర్హులైన నాయీ బ్రాహ్మణులందరికీ ఉచిత విద్యుత్ ను 150 నుంచి 200 యూనిట్లకు పెంచుతూ కేబినెట్ భేటీలో ఆమోదించడంపై సీఎం చంద్రబాబుకు మంత్రి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. గడిచిన ఎన్నికల్లో నాయీ బ్రాహ్మణుల కష్టాలను గుర్తించిన సీఎం చంద్రబాబు ఉచిత విద్యుత్ ను 200 యూనిట్ల వరకూ అందిస్తానని హామీ ఇచ్చిన విషయాని మంత్రి గుర్తు చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, బుధవారం సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో నిర్వహించిన కేబినెట్ భేటీలో నాయీ బ్రాహ్మణులందరికీ ఉచిత విద్యుత్ ను 150 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు పెంచుతూ మంత్రిమండలి సభ్యులు ఆమోదం తెలిపారన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా కేటగిరీ-II సర్వీస్ కింద 40,808 సెలూన్ షాపులు గుర్తింపు పొందాయన్నారు. ఈ షాపులన్నింటికీ నెలకు 200 యూనిట్ల మేర ఉచిత విద్యుత్ అందించనున్నట్లు వెల్లడించారు. నాయీ బ్రాహ్మణులకు అందించే ఉచిత విద్యుత్ వల్ల ప్రభుత్వంపై ఏటా రూ.100.20 కోట్లు భారం పడుతోందన్నారు. నాయీబ్రాహ్మణులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలియజేశారు. దేవాలయాల్లో పనిచేసే నాయీబ్రాహ్మణులకు ఇచ్చే గౌరవ వేతనం రూ.20 వేల నుంచి రూ.25 వేలకు పెంచిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. నాయీబ్రాహ్మణులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని ఆ ప్రకటనలో మంత్రి సవిత వెల్లడించారు.

# పులివెందుల్లో టీడీపీ గూండాల అరాచకంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు..

● దాడులు, దౌర్జన్యాలతో భయోత్పాతం సృష్టిస్తున్న అధికార పార్టీ.. ● టీడీపీ రౌడీయిజంపై అన్ని ఆధారాలను ఎస్ఈసీకి సమర్పించిన నేతలు.. ● తక్షణం ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి.. ● విజయవాడలో రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కలిసి దాడులపై ఫిర్యాదు చేసిన వైయస్ఆర్‌సీపీ ప్రతినిధి బృందం



**విజయవాడ,కలంకౌంటర్ :** వైయస్ఆర్ కడప జిల్లా పులివెందుల నియోజకవం-ర్గంలో స్థానిక సంస్థల ఉప ఎన్నిక సందర్భంగా అధికార తెలుగుదేశం పార్టీకి చెందని గూండాలు చేసిన దాడులు, దాష్టికాలపై వైయస్ఆర్‌సీపీ ప్రతినిధి బృందం విజయవాడలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీని కలిసి ఫిర్యాదు చేసింది. వైయస్ఆర్‌సీపీకి చెందిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌తో పాటు నాయకులు వేల్పుల రాము తదితరులపై దాడులతో భీభత్సం సృష్టించిన వైనంను అన్ని ఆధారాలతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు సమర్పించింది. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు టీడీపీకి కొమ్ముకాస్తూ, వైయస్ఆర్‌సీపీ నేతలపై దాడులకు తెగబడిన వారికి అండగా నిలుస్తున్నారని ఈ సందర్భంగా ఎస్ఈసీకి వివరించారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికల కార్యక్రమాన్ని నిర్వహించే పరిస్థితి లేకుండా చేస్తున్న అరాచక శక్తులపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఈసీని కలిసిన అనంతరం వైయస్ఆర్‌సీపీ నేతలు విజయ-వాడలో మీడియాతో మాట్లాడారు.

## - పులివెందుల్లో మోహార్గించిన టీడీపీ గూండాలు : కృష్ణా జిల్లా వైయస్సార్సీపీ అధ్యక్షులు, మాజీ మంత్రి పేర్ని నాని

ఈనెల 12న పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల నేపథ్యంలో టీడీపీ గూండాలు వైయస్సార్సీపీ నాయకుల మీద దాడులకు తెగబడ్డారు. రాష్ట్రంలో పదుల సంఖ్యలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు ఖాళీగా ఉన్నా వాటికి ఎన్నికలు నిర్వహించకుండా కేవలం రాజకీయ పబ్బం గడుపుకోవడమే ధ్యేయంగా చంద్రబాబు ఏరికోరి కడప జిల్లాలో రెండు జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహణకు నోటిఫికేషన్ ఇచ్చారు. చుట్టుపక్కల జిల్లాలకు చెందిన టీడీపీ గూండాలను పులివెందులలో మోహరించి అధికారాన్ని అడ్డం పెట్టుకుని వైయస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా దాడులకు తెగబడుతున్నారు. పులివెందులలో గెలిచామని ప్రచారం చేసుకోవడానికి చంద్రబాబు అనుక్షణం అలజడి సృష్టిస్తున్నారు. వైయస్ఆర్‌సీపీ నాయకులను 30 కార్లతో వెంబడించి కర్రలు, కత్తులతో దాడి చేశారు. వైయస్సార్సీపీకి చెందిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వైయస్సార్సీపీ మండల నాయకుడు వేల్పుల రాముల మీద దాడులకు తెగబడ్డారు. ప్రచారం ముగించుకుని కారులో వస్తున్న మా నాయకులను టీడీపీ గూండాలు కార్లతో ముందూ వెనుకా దిగ్బంధించారు. దాదాపు 30 కార్లతో మా నాయకుల కారును వెంబడించి ధ్వంసం చేసి, వారిని కారు నుంచి బయటకు లాగి ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వేల్పుల రాముల మీద కత్తులు, కర్రలతో దాడులు చేసి తీవ్రంగా గాయపరిచారు. పథకం ప్రకారం ఈ దాడి జరుగుతోందని అర కిలో మీటర్ దూరంలో ఉన్న పోలీసులకు ముందే తెలుసు. కానీ వారు అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. తల పగిలి ప్రాణాపాయస్థితిలో ఉన్న వేల్పుల రాము, గాయాలపాలైన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌లను ఆస్పత్రికి తరలించడానికి మాత్రం వచ్చారు. మేమే ఆస్పత్రిలో చేర్చామని చెప్పుకుంటున్న పోలీసులను నేను సూటిగా ప్రశ్నిస్తున్నా... ఎన్నికలను టీడీపీ నాయకులు ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారో పోలీసులకు తెలియదా? మా నాయకుల మీద దాడులకు తెగబడతారని, ప్రచారానికి వచ్చిన వైయస్సార్సీపీ నాయకులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులది కాదా? ఊరూరా షాడో పార్టీలు పెట్టలేదా? వారు ఏం చేస్తున్నారు?

## - ఉప ఎన్నికల్లో హింసాత్మక చర్యలు : ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

రాష్ట్రంలో ఉప ఎన్నికల ప్రక్రియ మొదలైన నాటి నుంచి హింసా వాతావరణం పెచ్చరిల్లిపోయింది. కుప్పంలో మణీంద్రం ఎంపీటీసీ స్థానానికి వైయస్సార్సీపీకి చెందిన దళిత మహిళ కనీసం నామినేషన్ వేయనీయకుండా టీడీపీ గూండాలు అడ్డుకుని నామినేషన్ పేపర్లు లాక్కున్నారు. ఇప్పుడు పులివెందుల రూరల్ జెడ్పీటీసీ స్థానంలో వైయస్సార్సీపీ నాయకులే లక్ష్యంగా టీడీపీ గూండాలు దాడులకు దిగుతున్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి మరీ పక్క జిల్లాల నుంచి అల్లరిమూకలను దించి అరాచకాలు సృష్టిస్తున్నారు. ప్రజల మద్దతుతో గెలిచే పరిస్థితి లేదని తెలుసుకున్న చంద్రబాబు ఓటర్లను భయాందోళనలకు గురిచేస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో హింసాత్మక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. ఒక బీసీ వర్గానికి చెందిన ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్ కారును చుట్టుముట్టి దాడులకు తెగబడ్డారు. దీనిని వైయస్సార్సీపీ తీవ్రంగా ఖండిస్తోంది. కొంతమంది పోలీసులు చట్టాన్ని ఉల్లంఘించి అధికారపార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారు. నామినేషన్లు దాఖలు చేసిన క్షణం నుంచి మా నాయకుల మీద దాడులను ప్రారంభించారు. పులివెందులలో దాడులు జరుగుతాయని ముందుగానే ఎన్నికల కమిషనర్‌కి ఫిర్యాదు చేయడం కూడా జరిగింది. ఎస్పీకి చెప్పానని ఎస్ఈసీ నీలం సాహ్నీ చెబుతున్నారు. కానీ గ్రౌండ్‌లో చూస్తే వైయస్సార్సీపీ నాయకులే లక్ష్యంగా దాడులు తీవ్రతరం చేశారు. కడప జిల్లాలోని పోలీస్ యంత్రాంగం, రెవెన్యూ, టీడీపీ నాయకులు ఒక్కటై (హ్యాండ్ ఇన్ గ్లోవ్) తెలుగుదేశం అభ్యర్థి విజయం కోసం పనిచేస్తున్నారు. ఇంతవరకు ఒక్క కేసు కూడా లేని గ్రామస్థాయి వైయస్సార్సీపీ నాయకులను, కార్యకర్తలను ప్రచారంలో పాల్గొననీయకుండా బైండోవర్ చేస్తున్నారు. పులివెందుల రూరల్ మండలంలో ఒక్క నాయకుడు కూడా బయటకు రాకుండా కొట్టి బెదిరించి అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు. బూత్ ఏజెంట్ అనేవాడు కూడా లేకుండా చేసి ఓట్లన్నీ వారే గుద్దుకోవాలనే కుట్రలు జరుగుతున్నాయి. అధికారమదంతో ఎవరైతే విర్రవీగి వైయస్సార్సీపీ శ్రేణుల మీద దాడులకు దిగుతున్నారో వారు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఎన్నికలను హింసకి తావులేకుండా పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీని విన్నవించడం జరిగింది.

# విజనరీ లీడర్ టీజీ భరత్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన న్యాయవాదులు







**తాడేపల్లి,కలంకౌంటర్ :** రాష్ట్ర మంత్రి , విజనరీ లీడర్,టీజీ భరత్ జన్మదినోత్సవం సందర్భంగా సచివాలయంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య అడ్వొకేట్స్ అసోసియేషన్ కన్వీనర్ గంగిసెట్టి రాజేశ్వరరావు , (జనరల్ సెక్రటరీ) కె. శ్రీధర్ మూర్తి , మణికంతేశ్వరరావు ,జి. ప్రసాంత్ , కె.వి.కె. సురేష్ తదితరులు.

# విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ ను హజ్ యాత్రికులు పెద్ద సంఖ్యలో సద్వినియోగం చేసుకోవాలి

● మ్యానిపెస్టోలో చెప్పిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం హజ్ యాత్రికులకు రూ. లక్ష ఆర్థిక సాయం అందజేత ● విజయవాడలో ఎంబార్కేషన్ పాయింట్ ను సాధించిన సీఎం చంద్రబాబు ● ఈ ఏడాది హజ్ యాత్రికులు విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ ను ఎంచుకోవాలి ● హజ్ యాత్రికులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్న కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు ● ఎస్ కె హసన్ బాషా, ఛైర్మన్, ఏపీ స్టేట్ హజ్ కమిటీ



**విజయవాడ, కలంకౌంటర్ :** విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ ను తిరిగి పునరుద్ధరించడంలో చొరవ చూపిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లకు హజ్ కమిటీ ఛైర్మన్ హసన్ బాషా ధన్యవాదాలు తెలిపారు. విజయవాడలోని హజ్ కమిటీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హజ్ కమిటీ ఛైర్మన్ హసన్ బాషా మాట్లాడుతూ మన రాష్ట్రానికి సెంట్రల్ హజ్ కమిటీ 2550 మందికి హజ్ యాత్రకు అవకాశం కల్పించిందన్నారు. గతేడాది విజయవాడ నుంచి పవిత్ర మక్కా యాత్రకు దరఖాస్తు చేసుకున్న 72 మందికి ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున కూటమి ప్రభుత్వం అందచేయడం హర్షనీయమన్నారు. ఈ ఏడాది పవిత్ర మక్కా యాత్రకు పయనమయ్యే యాత్రికులు విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ ను ఎంపిక చేసుకోవాలని కోరారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ ఎంపిక చేసుకున్న యాత్రికులకు ప్రభుత్వం రూ. లక్ష ఆర్థిక సాయం అందచేస్తుందని వివరించారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ ను మనం నిలబెట్టుకోవాలంటే పెద్ద సంఖ్యలో యాత్రికులు విజయవాడ నుంచి పవిత్ర మక్కా యాత్రకు బయలుదేరాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో పవిత్ర మక్కా యాత్రకు వెళ్లిన వారు ఎదుర్కొన్న ఇబ్బందులను కూటమి ప్రభుత్వం సరిదిద్ది వారికి మంచి సౌకర్యాలను కల్పించనుందని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. పవిత్ర మక్కా యాత్ర కు సిద్ధమైన యాత్రికులు హైదరాబాద్, బెంగుళూరు ప్రాంతాల నుండి ఎక్కువగా బయలుదేరుతున్నారని, కాని ఈఏడాది విజయవాడ నుంచి బయలుదేరే విధంగా ఇప్పటికే హజ్ కమిటీ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేశామని, అందరికి అవగాహన కల్పించామన్నారు. హజ్ యాత్రకు దరఖాస్తుకు మరొక్క రోజు మాత్రమే గడువు ఉందన్నారు. ఇప్పటికే 1900మందికి పైగా విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి ధరఖాస్తు చేసుకున్నారన్నారు. హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచాలని సెంట్రల్ హజ్ కమిటీ దృష్టికి తీసుకువెళ్లటం జరిగిందన్నారు. హజ్ కమిటీ డైరక్టర్ షెక్. అబ్దుల్ హుస్సేన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ సాధించి చూపించిందన్నారు. మ్యానిపెస్టోలో చెప్పిన విధంగా పవిత్ర మక్కా యాత్ర చేసిన హజ్ యాత్రికులకు రూ. లక్ష అందించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో హబిబుల్లా, మహమ్మద్ సాజి తదితరులు పాల్గొన్నారు







Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com